క్లుప్తంగా

స్కూల్ బ్యాగుల పంపిణీ



రాజవొమ్మంగి ఈబీఈ చర్చ్‌లో స్కూల్ పిల్లలకు బ్యాగ్స్ అందజేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: స్థానిక లైట్ హౌస్ ఈబీసీ చర్చి ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ బిషప్ ఎం.చంటిబాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని వయ్యేడు, బూరుగపల్లి, రాజవొమ్మంగి పరిసరాల నుంచి అశేషంగా క్రైస్తవ భక్తులు హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. సుమారు 100 మంది పిల్లలకు స్కూల్ బ్యాగ్‌లు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. శామ్యూల్‌రాజ్, ఎస్తేరు, బాబూరావు, అంజూరమ్మ, బాలసుందరం, జాన్‌బాబు, విన్సీ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

డ్రోన్‌లతో రైతులకు మేలు



వ్యవసాయ డ్రోన్ ప్రారంభిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో శ్రీహర్షిత్ తదితరులు

అనంతగిరి: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం పథకాలపై వీడియోను ప్రదర్శించి, ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం అగ్రికల్చర్ ఆధ్వర్యంలోని వ్యవసాయ డ్రోన్‌ను ఎంపీపీ శెట్టి నీలవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు జల్లడం తదితర పనులకు డ్రోన్‌లు చాలా ఉపయోగపడతాయన్నారు. ఎంపీడీవో శ్రీహర్షిత్, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

కొయ్యూరు: మంప పంచాయతీ మాజీ సర్పంచ్ ఇంగువ హరిమూర్తి పడాల్(70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. నాలుగుసార్లు ఆయన సర్పంచ్‌గా పనిచేశారు. పంచాయతీకి ఆయన సేవలను పలువురు కొనియాడారు. హరిమూర్తి పడాల్ మృతికి ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచ్ త్రినాథ్ పడాల్ తదితరులు సంతాపం తెలిపారు.

విద్యార్థినులకు అభినందనలు



ప్రతిభ చాటిన విద్యార్థినులతో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ, ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కౌశల్ సైన్స్ సంబరాల్లో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక పాఠశాల–1 విద్యార్థినిలు ప్రతిభను కనబరిచారు.సైన్స్ క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతి స్థానిక విద్యార్థినులు గెలిచారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ, ఉపాధ్యాయులు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయుల కృషితో పాటు విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధ కనబరచడం వల్ల ఈ ఫలితాలు సాధించినట్టు హెచ్‌ఎం లక్ష్మీ అన్నారు. ఉపాధ్యాయులు జగన్నాథం, ఈశ్వరి, తిరుమల, హేమవతి, పావని, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి, యూటీఎఫ్ నేతలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో సోమవారం 2024 యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎంఈవో కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు క్యాలెండర్, డైరీ, స్టిక్కర్స్ వంటి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణమూర్తి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో మండలంలో అన్ని పాఠశాలలు సర్వతోముఖంగా తీర్చిదిద్దబడాలని.విద్యాపరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నారు. యూటీఎఫ్ ప్రతినిధులు ధర్మారావు, రాజు, గోపి, శ్రీనివాసమూర్తి, సూర్యనారాయణ, ధనుపతి, సుబ్బారావు, రఘుమణి పాల్గొన్నారు.



అక్కచెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా

- డ్వాక్రా మహిళలకు రుణాలు
- నాలుగో విడత పంపిణీకి సిద్ధం

చింతూరు: స్వయం సహాయక సంఘాల అక్క, చెల్లెమ్మలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే మహిళలను ఆదుకునేందుకు రుణమాఫీకి చర్యలు చేపట్టారు. స్వయం సహాయక సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో చెల్లిస్తానని హామీనిచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డాక్రా మహిళల రుణాల మాఫీకి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు విడతల్లో బ్యాంకుల్లో జమచేయగా త్వరలోనే నాలుగో విడత జమ చేసేందుకు కసరత్తు పూర్తి చేశారు. తమ రుణాలను చెల్లించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ పథకం తమకు ఎంతో మేలు చేస్తోందని డ్వాక్రా సంఘాల మహిళలు చెబుతున్నారు. రుణాలతో కుటుంబపోషణకు ఇబ్బంది లేకుండా ఉంటుందంటున్నారు. తమ కుటుంబ ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా సాయమందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆసరా పథకం గురించి వివరిస్తున్న అధికారులు

పథకం లక్ష్యం ఇలా

వైఎస్సార్ ఆసరా పథకం స్వయం సహాయక బృందాల ఉత్పాదకను మెరుగుపరచడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో బ్యాంకుల్లో బకాయి రుణాలను తిరిగి చెల్లించేందుకు దోహదపడుతోంది. పథకంలో భాగంగా పట్టణ, గ్రామీణ స్వయం సహాయక బృందాల మహిళలకు 2019 ఎన్నికల నాటికి బ్యాంకుల్లో ఉన్న రుణాలను ప్రభుత్వం నాలుగు విడతలుగా చెల్లిస్తోంది. వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా మండలంలోని అన్ని స్వయం సహాయ సంఘాలకు చెందిన సభ్యుల ఖాతాల్లో ఈ సొమ్ములను నేరుగా ప్రతి ఏడాది జమ చేస్తున్నారు.

జీవనోపాధి పెంచేలా

ఈ పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణతో పాటు వ్యాపార రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో రుణ బకాయిలు తొలగించడం ద్వారా డ్వాక్రా మహిళలకు ఆర్థిక ఉపశమనంతో పాటు వ్యాపారాల అభివృద్ధికి మద్దతు లభిస్తోంది. దీంతో పాటు మహిళల జీవనోపాధి మెరుగు పరచడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని దిగ్విజయంగా అమలు చేస్తోంది.

చింతూరు మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం వివరాలు

	డ్వాక్రా సంఘాలు	సభ్యులు	సొమ్ము
మొదటి విడత	457	4,390	రూ.17.06కోట్లు
రెండో విడత	460	5,908	రూ.17.39కోట్లు
మూడో విడత	460	4,312	రూ.17.16 కోట్లు

మండలం:	చింతూరు
గ్రామాలు:	125
పంచాయతీలు:	18
స్వయం సహాయక సంఘాలు:	850
గ్రామ సంఘాలు:	51
స్వయం సహాయక సభ్యులు:	8,500



స్వయం సహాయ సభ్యుల సమావేశం

జగనన్నకు రుణపడి ఉంటాం



బ్యాంకుల్లో బకాయి పడ్డ అప్పును ప్రభుత్వమే విడతల వారీగా తీర్చడం ఎంతో హర్షణీయం. మా రుణాలను తీర్చడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. డ్వాక్రా సంఘ సభ్యులకు రుణాలు కల్పించడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు లేవు. జగనన్నకు రుణపడి ఉంటాం.

–సోయం విజయలక్ష్మి, నిమ్మలగూడెం

ఆర్థికంగా భరోసా



ప్రస్తుతం ప్రభుత్వం మా అప్పులను తీర్చడంతో ఆర్థికంగా మాకు ఎంతో భరోసా కల్పించింది. ఆ సొమ్ములను మేము ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహద పడుతున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆసరా పథకం మాలాంటి వాళ్లకు ఎంతో ఉపయోగపడుతుంది.అప్పులు తీరడంతో ఆనందంగా ఉంది.

–మేచర్ల పార్వతి, చింతూరు

మహిళలకు ఎంతో మేలు



వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సభ్యులకు ఎంతో మేలు చేకూరింది. ఇప్పటికే మూడు విడతలు చెల్లించాం. త్వరలోనే నాలుగో విడత కూడా బ్యాంకుల్లో జమచేయడం జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశానుసారం లబ్ధిదారుల ఎంపికపై సర్వే జరుగుతుంది. అర్హులందరికీ పథకం వర్తిస్తోంది.

–స్వామినాయుడు, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం, చింతూరు

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



ఘటాలతో ఊరేగింపు చేస్తున్న భక్తులు



అడ్డతీగలలో అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యూరు: అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలు, రామాలయ నిర్మాణ స్టిక్కర్లతో రాజేంద్రపాలెం సీతారామ ఆలయం నుంచి భక్తులు ఘటాలతో సోమవారం ఊరేగించారు. అయోధ్యలో ఈనెల 22న బాల రాముని విగ్రహ ప్రతిష్టను చేయనున్న నేపథ్యంలో అక్కడ నుంచి తీసుకువచ్చిన అక్షింతలు, రామాలయ నిర్మాణ స్టిక్కర్లను భక్తులకు పంపిణీ చేశారు. బాలరాముని విగ్రహ ప్రతిష్ఠి రోజున సాయంత్రం విధిగా ఇంటి వద్ద దీపాలను వెలిగించాలని కోరారు. రాజేంద్రపాలెం, సూరేంద్రపాలెంలో ఊరేగింపు నిర్వహించారు. వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, వీహెచ్‌పీ నేత మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల : మండల కేంద్రంలోని సోమవారం ఇంటింటా అయోధ్య రామాలయ అక్షింతలను పంపిణీ చేశారు. ఈ ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ వాసునిగా ఉపమాక వెంకన్న



ఉపమాకలో భక్తులకు వైకుంఠవాసునిగా దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామివారిని వైకుంఠ వాసునిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ధనుర్మాసంలో ఏకాదశినాడు ప్రారంభమైన రాపత్తు అధ్యయనోత్సవాల చివరి రోజైన సోమవారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పరమ పదం ఉత్సవం నిర్వహించారు. శ్రీదేవీ , భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారిని వైకుంఠ వాసునిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. నమ్మాళ్వార్లు, రామానుజుల వారిని సప్పరం వాహనంపై అలంకరించి స్వామివారికి అభిముఖంగా ఉంచి తిరువీధి సేవ నిర్వహించారు. సోమవారం పరమపదం ఉత్సవం నిర్వహించడంతో రాపత్తు అధ్యయనోత్సవాలు ముగిసినట్టేనని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మేలుకొలుపులు



చూచుకొండలో మేలుకొలుపులు



సత్యవరంలో మేలుకొలుపు నిర్వహిస్తున్న మహిళలు

మునగపాక: చూచుకొండలో మేలుకొలుపుల కార్యక్రమం భక్తి శ్రద్దలతో నిర్వహిస్తున్నారు. ధనుర్మాసంలో భాగంగా డిసెంబర్ 16న ప్రారంభమైన మేలుకొలుపు నిర్విరామంగా సాగుతుంది. పిల్లలు,పెద్దలు వేకువ జామున నిద్రలేచి భజనలు చేసుకుంటూ గ్రామంలోని పలు దేవాలయాలకు వెళ్లి దేవుళ్లను మేలు కొలుపుతున్నా రు. ఎంతో ఉత్సాహంగా మేలు కొలుపు జరుగుతుంది. భోగి పండగతో మేలు కొలుపు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

దుప్పుతూరులో మేలుకొలుపులు

అచ్యుతాపురం : దుప్పుతూరులో సోమవారం మేలుకొలుపులు నిర్వహించారు. ధనుర్మాసం పురస్కరించుకొని బ్రహ్మ ముహూర్తాన భక్తులు రాముని అక్షింతలు తలపై పెట్టుకొని గ్రామంలో మేలు కొలుపుల్లో పాల్గొన్నారు. కొల్లి అప్పారావు, మద్దాల రమణరావు, దేశంశెట్టి కృష్ణవేణి, ధార్మిక సమితి సభ్యులు పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలో మాడుగుల, సత్యవరం, జేడీపేట, వీరనారాయణం, కింతలి, ఒమ్మలి గ్రామాల్లో ఆదివారం మేలుకొలుపులు కార్యక్రమం నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజాము నుంచి పార్థసారథి స్వామి, సీతారాములు చిత్రపటాలను పురవీధుల్లో ఊరిగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

మునగపాక : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ సీనియర్ నేత కాళేశ్వరరావు కోరారు. పాటిపల్లి, నారాయుడుపాలెం గ్రామాల్లో సోమవారం ఆయన ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేశారు. ఈ కార్డు ద్వారా ప్రతి వ్యక్తికి రూ.5 లక్షల విలువైన ఆరోగ్య బీమా రక్షణ కలుగుతుందన్నారు. ఈ కార్డు దేశంలో ఎక్కడైనా చెల్లుబాటు అవుతుందన్నారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు



హుకుంపేటలో ఎంపీపీ రాజుబాబుకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు



జి.మాడుగులలో ఎంపీడీవో లోహిత్ జయసాగర్, బొకే అందజేస్తున్న సర్పంచ్‌లు తదితరులు



జి.మాడుగులలో తహసీల్దార్ అప్పలస్వామికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

డుంబ్రిగుడ/ముంచంగిపుట్టు: అల్లూరి జిల్లా వ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఇంటి వాకిళ్లో రంగు రంగులతో అందమైన ముగ్గులు వేసి 2024 సంవత్సరానికి స్వాగతం పలికారు. కేక్ కట్ చేసి సందడి చేశారు. గిరిజన గ్రామాల్లో థింసా నృత్యాలు చేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులతో కళకళలాడాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

డుంబ్రిగుడ: స్థానిక ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, ఎంపీటీసీలు తదితరులు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ ఆనందరావు, ఉపాధ్యక్షులు గణపతి, జగ్గునాయుడు, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, కృష్ణారావు, సింహచలం తదితరులు న్నారు.

అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ శెట్టి నీలవేణి నూతన సంవత్సరం సందర్భంగా కేక్‌కట్ చేసి, సిబ్బందికి తినిపించారు. ఎంపీడీవో శ్రీహర్షిత్‌కు జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

హుకుంపేట: స్థానిక ఎంపీడీవో కార్యలయంలో జరిగిన వేడుకలో ఎంపీపీ కూడా రాజుబాబును ఎంపీడీవో వెంకటరావు, ఎంఈవోలు చెల్లయ్య, ఈశ్వరరావు, ఈవోపీఆర్డీ అప్పలరాజు, హౌసింగ్ ఏఈ గౌరీశంకర్ తదితరులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జి.మాడుగుల: ఎంపీడీవో లోహిత్ జయసాగర్, తహసీల్దార్ కె.అప్పలస్వామిలకు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు విజయకుమారి, సన్యాసిదొర, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు బొకేలు అందజేసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

చింతపల్లిరూరల్: మండలంలోని నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎంపీపీ ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తదితరులు అడిషనల్ ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, తహసీల్దార్ లచ్చపాత్రుడు, ఎంపీడీవో ఆశాజ్యోతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సర వేడుకలు తెలిపారు.

కొయ్యూరు: రాజేంద్రపాలెంలో సర్పంచ్ పి.సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ముగ్గులు, డ్యాన్స్‌లు, పాటల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక మండల పరిషత్ , తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగిన వేడుకల్లో ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీ రామతులసి, గంగాదేవి, తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంఈఓ -2 మల్లేశ్వరరావు, ఆర్ఐ జిలానీ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.గంగవరం సెంటర్‌లో ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు సంతోష్, ప్రసాద్‌బాబు, ప్రభుదాస్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని షిర్డీసాయి మందిరం, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రాజేంద్రపాలెంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



నూతన సంవత్సర వేడుకల్లో జెడ్పీటీసీ బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి తదితరులు



రాజవొమ్మంగిలోని షిర్డీసాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

ఎటపాక: గొమ్ముకొత్తగూడెం పంచాయతీ పరిధిలోని ఎర్రబోరు గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. కోడి పందాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎటపాక ఎస్ఐ పార్థసారధి తన సిబ్బందితో అక్కడకు వెళ్లారు. కోడి పందాలు ఆడుతున్న వారు పోలీసులను గమనించి పారిపోతుండగా వారిలో నలుగురు పోలీసులకు చిక్కారు. వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో జూదాలు, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పార్థసారధి హెచ్చరించారు.

దుర్గగుడికి సైకిల్ యాత్ర



విజయవాడ దుర్గమ్మ సన్నిధికి సైకిల్‌పై బయలుదేరుతున్న శ్రీనివాసరావు

యలమంచిలి రూరల్ : విజయవాడ కనకదుర్గమ్మ గుడి యాత్రకు వరుసగా నాలుగోసారి యలమంచిలి ధర్మవరంకు చెందిన ముత్తిరెడ్డి శ్రీనివాసరావు సోమవారం బయలుదేరారు. స్థానిక కనకమహాలక్ష్మి భవానీ భక్త బృందంలో సభ్యుడిగా ఉన్న శ్రీనివాసరావు ప్రతి ఏటా భవానీ దీక్ష చేపడుతూ సైకిల్‌పై అమ్మవారి గుడికి బయలుదేరి వెళ్లి యాత్రను విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. నాలుగో ఏడాది కూడా యాత్రకు బయలుదేరి వెళ్లిన శ్రీనివాసరావుకు సోమవారం కనకదుర్గమ్మ ఆలయం వద్ద భవానీ దీక్షదారులు సాదరంగా వీడ్కోలు పలికారు. ఆ దుర్గమ్మ దయతో సకల శుభాలు కలుగుతాయన్న విశ్వాసంతో ప్రతి ఏటా దీక్ష చేపట్టి, సైకిల్ యాత్ర చేస్తున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. గురుభవానీలు కనక, తాటిపాకల చిన్ని, తాటిపాకల నాని, పలువురు భవానీ భక్తులు పాల్గొన్నారు.

శరవేగంగా రామమందిర నిర్మాణం



పనులు చేస్తున్న కార్మికులు

రోలుగుంట: కొవ్వూరులో రామ మందిరం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ రామ మందిరం శిథిలం కావడంతో గ్రామస్తులతో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ ఇటీవల సమావేశమయ్యారు. అందరూ సమష్టిగా ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు విరాళాలు సేకరించి నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామానికి చెందిన అభయాంజనేయ భక్త బృందం శ్రమదానంతో పనులు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రామ మందిర నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరంతోపాటు ఇక్కడ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం

యలమంచిలి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్ల పాత్ర ఎంతో క్రియాశీలకంగా ఉందని 17 వ వార్డు కౌన్సిలర్ పడాల కావ్యశ్రీనివాస్ అన్నారు. నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని యలమంచిలి రామ్‌నగర్ 17వ వార్డులో వలంటీర్లకు కౌన్సిలర్ కావ్య శ్రీనివాస్ సోమవారం వారి ఇంటి వద్ద వస్త్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఆలోచనతో వలంటీర్ వ్యవస్థను స్థాపించి ప్రతి పల్లె, పట్టణాల్లో ప్రజలకు పథకాలు చేరవేస్తున్నారని, వలంటీర్లకు గౌరవప్రదమైన వేతనం అందిస్తూ ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధిని కల్పిస్తున్నారని అన్నారు. ప్రజలకు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రతి ఒక్క ఇంటికి వెళ్లి వలంటీర్లు సేవలందించారని కితాబునిచ్చారు.